మూడో ప్రయత్నంలో 975వ ర్యాంకు



సాయిమోహిని

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లకు చెందిన రావాడ సాయిమోహినికి మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 975వ ర్యాంకు వచ్చింది. ఈమె తల్లిదండ్రులు ప్రకాశరావు, ఉషారాణి. నాన్న కోర్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తారు. అమ్మ రాజాం ఏరియా ఆస్పత్రిలో హెడ్ నర్సు. సాయిమోహిణి పదో తరగతి వరకు (మిగతా 6వ పేజీలో..)

అప్పుడు ఐపీఎస్ ఇప్పుడు ఐఏఎస్

- ఆ ఒక్క ఘటన.. తన జీవితాన్నే మార్చేసింది
- రెండో ప్రయత్నంలోనే ఐపీఎస్‌కు ఎంపిక
- మూడోసారి పరీక్ష రాసి.. ఐఏఎస్‌కు అర్హత
- సివిల్స్‌లో 15వ ర్యాంకు సాధించిన వెంకటేష్

మారుమూల గ్రామంలో పుట్టారు. అక్కడే ప్రాథమిక విద్య పూర్తయింది. చిన్నప్పటి నుంచి క్రికెట్ ఆడడం ఎంతో ఇష్టం. ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఓ దశలో ఐపీఎల్ వేలంపాటకు వెళ్లారు. అక్కడ ఎంపిక కాకపోయినా నిరాశ చెందలేదు. ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగంలో చేరారు. అక్కడ కొంతమంది స్నేహితులు సివిల్స్ రాసి విజయం సాధించడంతో తానూ ఆ దిశగా అడుగులు వేయాలని భావించారు. రెండో ప్రయత్నంలోనే ఐపీఎస్‌కు ఎంపికై శిక్షణ పొందుతున్నా.. అంతటితో ఆగలేదు. ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో మరింత కష్టపడి చదివారు. మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఏకంగా 15వ ర్యాంకు సాధించారు. ఇదీ జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన బాన్న వెంకటేష్ విజయగాథ.

నరసన్నపేట/ జలుమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యూపీపీఎస్ నిర్వహించిన సివిల్ సర్వీస్ పరీక్షల్లో జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన బాన్న వెంకటేష్ జాతీయస్థాయిలో 15వ ర్యాంకు సాధించారు. అల్లాడపేటలో వెంకటేష్ ప్రాథమిక విద్య పూర్తయింది. ఆ సమయంలో పక్క గ్రామంలో కలెక్టర్‌గా ఒకరు ఎంపికయ్యారు. ఆ కొలువు అంటే సమాజంలో ఎంతో గౌరవమని ఉపాధ్యాయులు చెప్పారు. ఆ మాటలు చిన్నతనంలోనే వెంకటేష్ మెదడులో దాక్కున్నాయి. పదోతరగతి, ఇంటర్, ఇంజనీరింగ్ చదివే రోజుల్లో క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నారు. స్నేహితులతో కలిసి ఎక్కువగా క్రికెట్ ఆడేవారు. జిల్లా జట్టుకు ఎంపికైనా.. మైదానంలో దిగే చాన్స్ రాలేదు. ఇంజనీరింగ్ పూర్తయిన తరువాత ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడేందుకు కూడా వేలం పాటలో పాల్గొన్నారు. అయినా అక్కడ కూడా అవకాశం కలిసి రాలేదు. దీంతో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.23 లక్షల జీతం కొలువులో చేరారు. అక్కడ తోటి స్నేహితులు కొంతమంది సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధమవడంతో వెంకటేష్‌కు చిన్నప్పుడు ఉపాధ్యాయులు ఐఏఎస్‌కు ఉన్న ప్రాధాన్యం గురించి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. దీంతో కరోనా సమయంలో ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటూ మరోవైపు సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూండేవారు. మొదటి ప్రయత్నంలో మెయిన్స్ పరీక్షలు వరకు రాశారు. రెండో ప్రయత్నంలో.. ఇంటర్వ్యూను కూడా ఎదుర్కొని.. ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సర్దార్ వల్లబాయ్‌పటేల్ పోలీసు అకాడమీలో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నారు. ఎలాగైనా ఐఏఎస్ సాధించాలనే తపనతో.. గతేడాది సివిల్స్ పరీక్షలు రాశారు. ముచ్చటగా మూడో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించారు.



బాన్న వెంకటేష్ (ఫైల్)

చేసిన తప్పు.. సరిదిద్దుకుని..

రెండో ప్రయత్నంలో మెయిన్స్‌లో మంచి మార్కులు సాధించినా.. ఇంటర్వ్యూలో సరిగా ఫేస్ చేయలేకపోయిన విషయాన్ని వెంకటేష్ గుర్తించారు. ఐఏఎస్ సాధనకు ఎక్కడ తప్పు జరిగిందో అక్కడ సరిదిద్దుకోవాలనే ఆకాంక్ష.. ఉందని కుటుంబసభ్యులు, బంధువుల వద్ద పలుమార్లు వెంకటేష్ చెప్పేవారు. మరింత (మిగతా 6వ పేజీలో..)

కేంద్ర, రాష్ట్ర మంత్రుల అభినందనలు..

కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఫోన్‌లో వెంకటేష్‌కు అభినందనలు తెలిపారు. మంచి ర్యాంకు రావడం ఎంతో గర్వకారణమన్నారు. మారుమూల ప్రాంతానికి చెందినా.. కృషి, పట్టుదల ఉంటే రాణించగలమనడానికి వెంకటేష్ సాధించిన విజయమే ఉదాహరణ అని పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశసేవలో మంచి పాత్ర పోషిస్తూ.. ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

జోషిబాబుకు 790వ ర్యాంకు..



జోషిబాబు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 22 (ఆంధ్ర జ్యోతి): కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట గ్రామానికి చెందిన లింగుడు జోషిబాబు సివిల్స్ పరీక్షలో 790వ ర్యాంకు సాధించారు. జోషిబాబు 1 నుంచి 10వ తరగతి వరకు టెక్కలిలో చదివారు. విశాఖపట్నం నారాయణ కళాశాలలో ఇంటర్, ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ పూర్తిచేశారు. ఢిల్లీలో రెండున్నరేళ్లుగా సివిల్స్‌కు కోచింగ్ తీసుకున్నారు. జోషిబాబు తండ్రి లింగుడు బాలయ్య మాజీ సైనిక ఉద్యోగి. చిన్నాన, అత్తయ్య కూడా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. అగ్నికుల సామాజిక వర్గం నుంచి సివిల్స్‌కు ఎంపికైన మొద టి వ్యక్తి జోషిబాబు కావడం విశేషం. ఆయన ఎంపికపై అస్సాం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ కోత రవి, అభ్యుదయ రైతు కోత మధుసూదనరావు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు అంగ గున్నయ్య, గేదేల వీరన్న స్వామి, యూత్ సభ్యుడు లింగుడు అభినందనలు తెలిపారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి

- కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు

గార, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పూర్వీకులు నిర్మించిన వారసత్వ సంపదను కాపాడుకుంటూ.. భావితరాలకు దానిని అందించే ప్రయత్నం చేయాలని శ్రీకూర్మం క్షేత్రం వంశపార్య ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రీకూర్మంలో తాబేళ్ల మృత్యువాత పడిన సమాచారం తెలిసి మంగళవారం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన ఆలయాన్ని సందర్శించారు. కూర్మనాథ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. తాబేళ్ల మృత్యువాత పడిన స్థలాన్ని, తాబేళ్ల పార్క్‌ను పరిశీలించారు. ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీకూర్మంలో తాబేళ్లు కూడా స్వామికి దగ్గరగా ఉండాలని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. శ్రీకూర్మం క్షేత్రానికి సంబంధించిన ఆభరణాలు సింహాచలం దేవస్థానంలో ఉన్న విషయాన్ని ఆయన తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకూర్మంలోని ఆలయంలో ఒక లాకర్ ఏర్పాటు చేసి ఆభరణాలను భద్రపరచాలని అధికారులను అశోక్‌గజపతిరాజు ఆదేశించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, సహాయ కమిషనర్ వై.భద్రాజీ పాల్గొన్నారు.



శ్రీకూర్మంలో తాబేళ్లను పరిశీలిస్తున్న కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు



మాట్లాడుతున్న జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పక్కన మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

సాగునీటి కల సాకారం

- శివారు ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- వంశధార ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని ఆదేశం

శ్రీకాకుళం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో సాగునీటి భవితవ్యాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, సాగునీటి కల సాకారం చేస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి శివారుభూములకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. నేరడి సైడ్‌వీయర్ వద్ద పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించి ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా హిరమండలం రిజర్వాయర్‌కు నిరంతరాయంగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 88వ ప్యాకేజీలో 90శాతం పనులు పూర్తయినా.. భూసేకరణలో జాప్యం, పరిహారం చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను ఆలస్యం చేస్తున్న ఏజెన్సీలకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులు నెమ్మదిగా (మిగతా 6వ పేజీలో..)

● వంశధార ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

'వంశధార ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఒడిశాతో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం. హిరమండలం రిజర్వాయర్‌ను పూర్తి సామర్థ్యానికి నింపేందుకు చర్యలు తీసుకుంటాం. గొట్టాబ్యారేజీ ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభిస్తాం. మదన గోపాలసాగరం, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టులను కూడా పూర్తిచేస్తాం. వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనులను వేగవంతం చేస్తాం. జిల్లాలో నేరడి బ్యారేజీ అంశం... అంతర్రాష్ట్ర జల వివాదాలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తూనే.. ఎత్తిపోతల పథకాల ద్వారా ప్రాజెక్టుల్లో నీటిని పుష్కలంగా నీటిని నింపే ఏర్పాట్లు చేపడుతున్నామ'ని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు.

● షట్టర్ల కుంభకోణంపై చర్చ

వంశధార కాలువల షట్టర్ల కుంభకోణంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కోర్టు అనుమతి పొంది వెంటనే షట్టర్లను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాల్లోని 108 గ్రామాలకు సాగునీరు అందుతుందని.. ఇప్పటివరకు 45 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. భూసేకరణ సమస్యల పరిష్కారానికి స్థానికులతో చర్చలు జరుగుతున్నాయని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వివరించారు.

నీటి నిల్వ సామర్థ్యం పెంచాలి

- వంశధార రిజర్వాయర్‌లో 2,400 క్యూసెక్కులు ఉంటేనే పూర్తిస్థాయిలో సాగునీరు
- జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు

టెక్కలి/ మెళియాపుట్టి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): 'వంశధార రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1,600 క్యూసెక్కుల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. అదే 2400 క్యూసెక్కుల నీరు నిల్వ ఉంచగలిగితే ఇచ్ఛాపురం వరకూ సాగునీరు అందించగలమ'ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. మంగళవారం మదనగోపాల సాగరాన్ని మంత్రి రామానాయుడు పరిశీలించారు. సాగునీటికి సంబంధించిన సమస్యలను మంత్రి అచ్చెన్న, ఇంజనీరింగ్ అధికారులు ఆయనకు వివరించారు. 'మదన గోపాలపురం సాగరం అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే అధికంగా మెట్టు ప్రాంతాలకు సాగు నీరందుతుంది. వంశధార కాలువ పరిధిలో 26 ఎత్తిపోతల పథకాలు ద్వారా పంటలు బాగా పండుతున్నాయి. మదనగోపాలసాగరాన్ని లోతు చేసి నీటి నిల్వ సామర్థం పెంచేతే.. జగన్నాథపురం వరకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇవ్వగలం. 2019లో నాబార్డు నిధులు రూ.580కోట్లు మంజూరైనా.. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులు చేపట్టలేదు. ప్రస్తుతం రూ.1600 కోట్లతో అంచనాలు (మిగతా 6వ పేజీలో..)

అమ్మ కడుపు కోత

- జిల్లాలో పెరుగుతున్న సిజేరియన్ల సంఖ్య
- తగ్గుతున్న సాధారణ ప్రసవాలు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే అధికం
- కాసుల కోసం అవసరం లేకున్నా ఆపరేషన్లు



అరసవల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ధనర్జానే ధ్యేయంగా సిజేరియన్లు చేస్తున్నాయి. సాధారణ ప్రసవానికి వీలున్నప్పటికీ కాసుల కోసం గర్భిణుల కడుపు కోసేస్తున్నారు. ఉమ్మనీరు తక్కువగా ఉందని, బిడ్డ అడ్డంగా తిరిగిందని, గుండె వేగంగా కొట్టుకోట్టోందని గర్భిణులను, వారి కుటుంబ సభ్యులను భయపెడుతున్నారు. దీంతో వారు శస్త్రచికిత్సకు అంగీకరిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు మాత్రం మంచి ముహూర్తాలు చూసుకుని కోరుండి సిజేరియన్ చేయాలని వైద్యులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం లేక చాలామంది గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా అవసరం లేకపోయినా వారికి ఆపరేషన్లు చేసేస్తున్నారు. మరోపక్క జిల్లాలో ఆడపిల్లల జననాల సంఖ్య తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. స్కానింగ్ సెంటర్లలో ఏమైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2024-2025 ఏడాదికి సంబంధించి ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో 28,993 ప్రసవాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10,289, ప్రైవేటు ఆసుపత్రుల్లో 18,704 నిర్వహించారు. సాధారణ ప్రసవాలకు సంబంధించి ప్రభుత్వాసుపత్రుల్లో 4,717 (46శాతం), ప్రైవేటులో కేవలం 2,466 (13శాతం) మాత్రమే జరిగాయి. సిజేరియన్లకు సంబంధించి ప్రభుత్వాసుపత్రుల్లో 5,605 (54శాతం), ప్రైవేటు ఆసుపత్రుల్లో 16,058 (87శాతం) నిర్వహించారు. సకల సదుపాయాలు, ఎంతో నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉండే ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక శాతం సాధారణ ప్రసవాలు జరగాల్సి ఉంది. కానీ, కాసుల కోసం సిజేరియన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే గర్భిణులను, వారి సహాయకులను ముందుగానే వైద్యులు సిజేరియన్ కోసం మానసికంగా సిద్ధం చేస్తున్నారు. కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందనో.. లేదా ఆపరేషన్ చేయకపోతే తల్లి, బిడ్డ ప్రాణాలకు ప్రమాదకరమనో... ఇలా భయపెడుతూ ఆపరేషన్ చేసి మరీ ప్రసవాలు కానిచ్చేస్తున్నారు. సాధారణ ప్రసవానికి కేవలం రూ. 15వేలు మాత్రమే వసూలు చేస్తే, అదే సిజేరియన్ చేస్తే రూ. 50వేల నుంచి రూ.80వేల వరకు రోగులకు ఖర్చవుతుంది. భయంతోనో, వైద్యునిపై నమ్మకంతోనో, అధిక శాతం ఇటువంటి ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అలాగే, కొందరు తల్లిదండ్రులు ముందుగానే ముహూర్తాలు నిర్ణయించుకుని, ఆ సమయంలోనే ఆపరేషన్ చేయాలని వైద్యులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో వైద్యులు సిజేరియన్ చేసి శిశువులను బయటకు తీస్తున్నారు. అదే విధంగా కొందరు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆర్ఎంపీలు కమీషన్లకు ఆశపడి గర్భిణులను ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకువెళుతున్నారు. దీంతో ఎక్కువ ప్రసవాలు సిజేరియన్ పద్ధతిలోనే జరుగుతున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకమేదీ?

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇంచుమించుగా సగానికి సగం ప్రసవాలు సాధారణంగానే జరుగుతున్నాయి. పేదలు, సామాన్యులు, అలాగే క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారు ప్రసవాల కోసం ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అటువంటి కేసుల్లో కూడా సగం ప్రసవాలు సాధారణ పద్ధతిలోనే జరుగుతుండడం విశేషం. అయినా సరే అధిక శాతం ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీనికి ప్రభుత్వ ఆసుపత్రుల సేవలపై నమ్మకం లేకపోవడమే కారణం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామాలు, పట్టణాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు నమోదు చేస్తున్న గర్భిణుల డేటాను జిల్లా కేంద్ర ఆసుపత్రి, సీహెచ్‌సీలు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయాలతో అనుసంధానించి, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. సాధారణ ప్రసవాల గురించి, వైద్యులు అందించే సేవలపై ప్రజలకు పూర్తిగా తెలియజేసి, వారిలో నమ్మకం కలిగిస్తే, రానున్న రోజుల్లో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ దిశగా అధికారులు (మిగతా 6వ పేజీలో..)

వైసీపీ నుంచి దువ్వాడ ఔట్

8లో



- పార్టీ క్రమశిక్షణ దాటారని ఫిర్యాదులు

300 కార్డులకు రేషన్ కట్!

- జేఆర్ పురం పంచాయతీలో రెండు నెలలుగా అంతే
- ఆందోళనలో లబ్ధిదారులు

6లో

సోషల్ వెల్ఫేర్ డీడీపై విచారణ

- ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు
- వార్డెన్ల ప్రమోషన్లలోనూ అవకతవకలు

7లో



విచారణకు హాజరైన బాధితులు

ఆ 'నేస్తం' ప్రత్యేకం

- స్నేహానికి గ్రామీణుల కొత్త నిర్వచనం
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న సంప్రదాయం

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి)

స్నేహం... సాధారణంగా అభిరుచులు కలిగిన ఇద్దరో ముగ్గురో వ్యక్తులు కలసి నడవడం.. ఒకరికొకరు సహకరించుకోవడం... కొందరైతే చిన్నతనం నుంచి కలసిమెలసి పెరగడం వల్ల ఒకే మాట..ఒకే బాటగా ఉండడం మనకు తెలుసు. ఉద్దానం ప్రాంతంలో స్నేహబంధం మాత్రం రక్తసంబంధం కంటే మిన్నగా ఉంటుంది. అక్కడ స్నేహితులను నేస్తం (సోదరుని వరుస), మొకర (బావ వరుస), మిత్తమ్మ (పిన్ని/పెద్దమ్మ వరుస), మిత్తయ్య (చిన్నాన్న, పెదనాన్న)గా పిలుచుకుంటారు. ముఖ్యంగా రెండు వేర్వేరు సామాజిక వర్గాల వారి మధ్య ఈ నేస్తరికం, మొకర వంటి బంధాలను ఏర్పరచుకుంటారు. ఇచ్ఛాపురం నుంచి వజ్రపుకొత్తూరు వరకు ఉన్న అనేక గ్రామాలలో మనకు ఈ నేస్తం, మొకర అనే పిలుపులు వినిపిస్తాయి. దేవునల్తాడ గ్రామంలో ఏటా ఆగస్టు రెండో వారంలో శివాలయంలో ప్రత్యేకంగా నేస్తరికం కట్టుకుంటారు. ఒకసారి నేస్తరికం చేశాక రెండు కుటుంబాలు ఒక్క కుటుంబంలా కలసి మెలసి ఉంటాయి. పెళ్లిళ్ల లాంటి వేడుకల్లో అంతా తామై తోడుగా ఉంటారు. వారి వారసులు సైతం ఈ బంధాన్ని కొనసాగించడం గమనార్హం. ఇంకో విశేషమేమంటే... నేస్తం, మొకర అనే బంధాలు కలుపుకున్న వారు పరస్పరం పేర్లు పెట్టి పిలుచుకోరు. కేవలం నేస్తం, మొకర అనే సంబోధించుకుంటారు. అలాగే అత్త వరుస వారికి గాదెప్పా అని, వదిన వరుస వారికి బొన్ని అని పిలుచుకుంటారు. పూర్వం నుంచి ఉన్న ఈ బంధాలు నేటికీ కొనసాగుతుండడం... అంతే పటిష్ఠంగా ఉండడం గమనార్హం.



పూర్వీకుల నుంచి కొనసాగుతోంది..

మాది డోకులపాడు గ్రామం. మా తండ్రి అప్పన్న చినవంకకు చెందిన సింహాద్రి నాయుడుతో నేస్తరికం కట్టారు. ఆ తరువాత మేం వారి పిల్లలుగా ఆ బంధాన్ని కొనసాగిస్తున్నాం. 60 ఏళ్లుగా మా రెండు కుటుంబాల మధ్య బంధం కొనసాగుతోంది.

-పుక్కళ్ల చిరంజీవులు, ప్రభుత్వ కళాశాల లెక్చరర్



దేవునల్తాడ శివాలయం వద్ద నేస్తరికం కట్టుకుంటున్న బాలికలు (ఫైల్)

ఎండ నుంచి రక్షణకు ఇలా..

మెళియాపుట్టి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని నుంచి కొంతమేర ఉపశమనం కోసం ఓ వాహనదారు వినూత్నంగా ఆలోచించాడు. ఎండవేడిమి నుంచి తప్పించుకునేందుకు బైక్ టాప్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ టాప్‌ను రూ.6 వేలు వెచ్చించి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ బైక్‌పై వెళుతుంటే ఆకర్షణీయంగా కనిపిస్తోంది.



తినేద్దామా... తాటిముంజెలు



- వేసవి నేస్తాలకు భలే డిమాండ్

ఎచ్చెర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో చల్లదనాన్ని ఇచ్చే వాటిలో ముందు వరుసలో నిలిచేవి తాటిముంజెలు. ఎండల నుంచి తక్షణ ఉపశమనానికి తాటిముంజెలు ఎంతో ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు. కేవలం వేసవి కాలంలోనే లభ్యమయ్యే వీటిని తినడంలో ఉన్న మజాయే వేరు. గతంలో ఎక్కడ చూసినా తాటి తోపులు ఎక్కువగా కనిపించేవి. దీంతో ఎక్కడ చూసినా ముంజెలు విస్తారంగా లభించేవి. అది కూడా చౌక ధరలకే. ప్రస్తుత పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. చిలకపాలెంలో పదేళ్ల క్రితం వరకు జోరుగా ఉండే తాటిముంజెల విక్రయం నేడు బాగా తగ్గిపోయింది. శ్రీకాకుళం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోనూ ఒకప్పుడు విరివిగా దొరికేవి. ఇప్పుడు చాలా తక్కువగా ఉంటున్నాయి. చాలా వరకు మెట్ట భూములు రియల్ ఎస్టేట్లుగా మారుతుండడంతో తాటితోపులు తరిగిపోతున్నాయి. దీంతో అక్కడక్కడ మాత్రమే తాటిముంజెలు లభ్యమవుతున్నాయి. దీని వల్ల మూడు తాటిముంజెలను రూ.10 నుంచి రూ.15 వంతున విక్రయిస్తున్నారు.

ముంజెలతో మేలు..

తాటిముంజెలు తక్కువ కేలరీలతో ఎక్కువ శక్తిని శరీరానికి అంది సాయని... వేసవిలో వీటిని తినడం వల్ల చాలా ప్రయోజనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. తాటిముంజెలు లేత కొబ్బరిని పోలి ఉంటాయి. అందుకే ప్రతి ఒక్కరూ వీటిని తినేందుకు ఇష్టపడతారు. శరీరానికి కావలసిన మినరల్స్ చక్కెరను సమతుల్యం చేస్తుంది. వేసవి ఉష్ణోగ్రతలతో కొంత మందికి వాంతులయ్యే అవకాశం ఉంది. వీటికి తాటిముంజెలతో చెక్ పెట్టవచ్చు. అలాగే డీహైడ్రేషన్ నుంచి రక్షించడంతో పాటు పొట్టను శుద్ధిగా ఉంచడంలో తాటిముంజెలు కీలక పాత్ర పోషిస్తాయని వైద్యులు చెబుతున్నారు.





మూడో ప్రయత్నంలో 975వ ర్యాంకు..

(ఐదో పేజీ తరువాయి)

శ్రీకాకుళం శార్వాణీ స్కూల్‌లో, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్య కాలేజీలో చదివారు. అనంతరం ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ 2021లో పూర్తిచేశారు. ఆమె మాట్లాడుతూ 'మెడిసిన్ పూర్తయిన వెంటనే సివిల్స్ శిక్షణ ప్రారంభించాను. ఆప్షనల్‌గా మెడికల్ సైన్స్‌ను ఎంచుకున్నాను. 2021 మార్చిలో ప్రిపరేషన్ ప్రారంభించాను. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ పూర్తిచేశాను. మెయిన్స్‌లో ఫెయిల్ అయ్యాను. 2023లో ప్రిలిమ్స్ ఫెయిల్ అయ్యాను. కొంత ఆందోళన చెందాను. కుటుంబ సభ్యులు ప్రోత్సాహంతో మూడోసారి ప్రయత్నించాను. ఇప్పుడు 975 ర్యాంకు వచ్చింది. ఈ ర్యాంకుకు ఐఆర్ఎస్ గానీ, ఐఆర్ఎల్ఎస్ గానీ రావచ్చు. కానీ మరోసారి ప్రయత్నిస్తాను. కలెక్టర్ కావడమే లక్ష్యం' అని ఆమె తెలిపారు. ఈమె ప్రస్తుతం చినవాల్తేరులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు

సీఎం వస్తారని..

- సభా ఏర్పాట్ల పరిశీలన

ఎచ్చెర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార భరోసా పథకాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 26న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుడగట్లపాలెం గ్రామానికి రానున్నారు. ఈ కార్యక్రమం కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌లు మంగళవారం బుడగట్లపాలెంలోని సముద్ర తీరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో నిర్వహించే సమావేశానికి గ్రామానికి చివర్లో... తీరానికి 300 మీటర్ల దూరంలో స్థలాన్ని ఎంపిక చేశారు. అలాగే సీఎం చంద్రబాబు ముగ్గురు మత్స్యకారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులు, జీవన విధానం, సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. దీనికి సంబంధించి రూట్ మ్యాప్ సైతం సిద్ధంచేశారు. హెలీపాడ్, ఫిషింగ్ లాండింగ్ సెంటర్, సభా వేదిక, పార్టీ శ్రేణులతో సమావేశం తదితర వాటికి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజుల నుంచి అధికారులు ఈ గ్రామాన్ని సందర్శిస్తూ.. సీఎం సభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2 వేల మంది మత్స్యకారులతో, 500 మంది పార్టీ శ్రేణులతో వేర్వేరుగా సమావేశాల నిర్వహణకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.సాయిప్రత్యూష, తహసీల్దార్ బి.గోపాల్, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

అప్పుడు ఐపీఎస్.. ఇప్పుడు ఐఏఎస్

(ఐదో పేజీ తరువాయి)

పట్టుదలతో చదివి.. మూడోసారి పరీక్షలు రాసి.. ఇంటర్వ్యూను బాగా ఎదుర్కొన్నారు. గతంలో కన్నా రెండు మార్కులు ఎక్కువ సాధించి.. ఐఏఎస్‌కు ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచారు.

● వారే ఆదర్శంగా..

అల్లాడపేటకు పక్కనే ఉన్న సైరిగాం గ్రామానికి చెందిన ముద్దాడ రవిచంద్ర గతంలో ఐఏఎస్ సాధించారు. అలాగే వెంకటేష్ అమ్మమ్మ గ్రామం బసివలస పక్కన జమ్ముకు చెందిన సాధు శిబిచక్రవర్తి కూడా గతంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఈ ప్రాంతంలో తిమడాం గ్రామం నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించిన వారు అధికంగా ఉన్నారు. అటువంటి వారందరినీ ఆదర్శంగా తీసుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలనే ఉద్దేశంతో వెంకటేష్ పట్టుదలతో చదివారని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు.

కుగ్రామంలో పుట్టి..

అల్లాడపేట ఓ కుగ్రామం. ఈ గ్రామానికి గతంలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో అద్దోనం పేటగా కూడా పిలిచేవారు. అటువంటి గ్రామంలో జన్మించిన వెంకటేష్ సివిల్ సర్వీసు పరీక్షల ఫలితాల్లో సత్తాచాటి ఔరా అనిపించారు. ఐఏఎస్‌కు ఎంపికకావడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేష్ తండ్రి బాన్న చంద్రరావు వ్యవసాయంతోపాటు చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తల్లి రోహిణి గృహిణి. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వెంకటేష్ కాగా, చిన్న కుమారుడు వంశీ ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నాడు. వెంకటేష్ ప్రాథమిక విద్యాభ్యాసం అల్లాడపేటలోనే సాగింది. 6, 7 తరగతులు గాయిత్రి మునసబుపేటలోను, 8 నుంచి 10వ తరగతి వరకు కేశవరెడ్డి స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. వైజాగ్ శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్ చదువుకొని.. తమిళనాడులో ఐఐటీ పూర్తి చేశారు. అనంతరం రెండేళ్లు చెన్నైలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేశారు. అక్కడ ఉద్యోగం చేస్తూ 2023లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అప్పట్లో అల్లాడపేట గ్రామ ఖ్యాతిని నలుమూలల చాటిచెప్పిన వెంకటేష్. గతేడాది సివిల్స్ పరీక్ష రాసి.. తాజాగా ఐఏఎస్‌కు ఎంపిక కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు కుటుంబంలో జన్మించి ఐఏఎస్‌కి ఎంపికవడంపై పలువురు అభినందిస్తున్నారు.

బసివలసలో సంబరాలు..

వెంకటేష్ జాతీయస్థాయిలో 15వ ర్యాంకు సాధించడంతో అమ్మమ్మ గ్రామమైన నరసన్నపేట మండలం బసివలసలో బంధువులు సంబరాలు చేసుకున్నారు. వెంకటేష్ కలెక్టర్ అయ్యేందుకు అర్హత సాధించాడని తెలియడంతో తాతయ్య మెండ శిమ్మయ్య, అమ్మమ్మ నర్సమ్మ ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఐపీఎస్ ట్రైనింగ్‌లో ఉన్నా, కలెక్టర్ కావాలనే లక్ష్యంతోనే మరింత ప్రణాళికబద్ధంగా చదివి లక్ష్యాన్ని సాధించాడని మేనమామలు మెండ ఢిల్లీశ్వరరావు, ఇంద్రుడు, రుద్రుడు తెలిపారు.

300 కార్డులకు రేషన్ కట్!

- రెండు నెలలుగా అంతే
- ఆందోళనలో లబ్ధిదారులు

రణస్థలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం ప్రభుత్వం రేషన్ అందిస్తోంది. ప్రతి నెల రేషన్ కార్డులోని లబ్ధిదా రులకు ఐదు కిలోల చొప్పున అందిస్తూ వస్తోంది. కానీ జేఆర్‌పురం పంచాయతీ పరిధిలో వందలాది మంది రేషన్ కార్డుదారులకు గత రెండు నెలలుగా రేషన్ అందడం లేదు. అధికారులు, డీలర్ల వల్ల జరిగిన తప్పిదానికి లబ్ధిదారులు బలవుతున్నారు. జేఆర్‌పురం పంచాయతీ పరిధిలో 4 రేషన్ డిపోలు ఉన్నాయి. గత రెండు నెలలుగా రేషన్ డిపో-1లో 250 మంది కార్డుదారులకు, ఇతర డిపోల్లో 20 నుంచి 30 మంది కార్డుదా రులకు బియ్యం అందించలేదు. ఇదేమని ప్రశ్నిస్తే డీలర్లు స్టాకు లేదని చెబుతు న్నారు. అధికారు లకు ఫిర్యాదు చేస్తుంటే బియ్యం పంపించామని చెబుతున్నారు. ఇలా ఒకరిపైన మరొకరు నెపం పెట్టుకుంటు న్నారు. రేషన్ దొరకకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో లబ్ధిదారులకు తెలియడం లేదు.

డీలర్ల గగ్గోలు..

సాధారణంగా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ డిపోలకు బియ్యం సరఫరా అవుతుంది. గత ఐదేళ్లుగా బియ్యం నిల్వలు సరఫరా కాకుండా ఉండిపోయాయి. వాటిని సర్దుబాటు చేయాలని డీలర్లకు అధికారులు ఆదేశించారు. మిగులు బియ్యాన్ని లబ్ధిదారులకు అందించి రికార్డులు క్లియర్ చేయాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నుంచి తీసుకొచ్చేటప్పుడు 50 కిలోల దగ్గర 2 కిలోల వరకూ తరుగు వస్తోందని తామేమీ చేయలేమని డీలర్లు చేతులెత్తేస్తున్నారు. గత రెండు నెలలుగా ఇదే తంతు. అందుకే ముందుగా రేషన్ తీసుకున్న వారికి బియ్యం దొరుకుతున్నాయి. కానీ చివర్లో రేషన్ కోసం వెళ్లిన వారికి దొరకని పరిస్థితి. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 300 మంది కార్డుదారులకు గత రెండు నెలలుగా రేషన్ అందలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది. దీనిపై సంబంధిత రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ప్రతి ఒక్కరికీ రేషన్ అందాలని, లేకుంటే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రెండు నెలలుగా ఇలాగే...



జేఆర్‌పురం పరిధిలో రేషన్ బియ్యం ఇవ్వడం లేదు. గత రెండు నెలలుగా వందలాది మందికి రేషన్ అందించలేదు. డీలర్లను అడిగితే తమకు తెలియదంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తుంటే పట్టించుకోవడం లేదు.

-డి.శ్రీదేవి, లబ్ధిదారు, దన్నానపేట

దారుణం..



రెండు నెలలుగా రేషన్ అందించకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో ఇలా ఉంటే గ్రామాల్లో ఎలా ఉంటుందో. కనీసం దీనిపె సమాధానం చెప్పేవారు లేరు. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టాలి. లేదంటే లబ్ధిదారుల నుంచి ప్రతిఘటన తప్పదు.

-సారిపల్లి సూరమ్మ, లబ్ధిదారు, దన్నానపేట

అమ్మ కడుపు 'కోత'

(ఐదో పేజీ తరువాయి)

నాయకులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తగ్గుతున్న ఆడపిల్లల జననాలు..

జిల్లాలో గత ఏడాది ఆడపిల్లల జననాల సంఖ్య తక్కువగా నమోదైంది. 2024-25 సంవత్సరానికి గాను మగపిల్లలు 15,457 మంది, ఆడపిల్లలు 13,536 మంది జన్మించారు. అంటే ఆడ శిశువులు 1921 తక్కువగా ఉన్నాయి. సుమారు 9 శాతం తక్కువగా నమోదైంది. ఒక దశాబ్ద కాలంపాటు ఈ సంఖ్య ఇలాగే కొనసాగితే రానున్న తరానికి ఇబ్బందులు తప్పవు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆడపిల్లల కోసం ప్రత్యేక పథకాలను ప్రకటిస్తూ 'బేటీ బచావో... బేటీ పడావో' అంటుంటే, జిల్లాలో మాత్రం ఆడశిశువుల జననాలు తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి గల కారణాలను అధికారులు విశ్లేషించాలని, స్కానింగ్ కేంద్రాల్లో ఏమైనా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారా? అన్నది తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి కల సాకారం

(ఐదో పేజీ తరువాయి)

సాగుతుండటంపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొట్టా ఎత్తిపోతల పథకం పూర్తయితే 12 టీఎంసీల నీరు హిరమండలం రిజర్వాయర్‌కు తరలించవచ్చని.. ఇది కీలకమైన ప్రాజెక్టు అని తెలిపారు. గొట్టాబ్యారేజీ ఆప్రాన్ పనుల కోసం రూ.12.81 కోట్ల టెండర్లను వెంటనే పిలవాలని ఆదేశించారు.

● అధికారులు మాట్లాడుతూ.. 'రూ.145కోట్ల విలువైన పనుల్లో రూ.22కోట్ల పనులు పూర్తయ్యాయి. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వంశధార ఎడమ ప్రధాన కాలువ సామర్థ్యం 2480 క్యూసెక్కులు అయినా, ప్రస్తుతం 1800 క్యూసెక్కుల నీరు మాత్రమే అందుతోంది. 104 కిలోమీటర్ల ఉన్న ఈ కాలువను ఆధునీకీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ● నాగావళి-వంశధార నదుల అనుసంధాన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కోరారు. రణస్థలం మండలం పైడిభీమవరం పారిశ్రామికవాడకు సాగునీటి ప్రాజెక్టుల నుంచి నిరంతరాయంగా నీటి సరఫరా ఉండేలా చొరవ చూపాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు కోరారు. కళింగపట్నం, అంబళ్లవలస ఎత్తిపోతల పథకాల పనులు పూర్తిచేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రిని కోరారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ రామ్‌గోపాల్, డీఆర్వో వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ ఈఈ సుధాకరరావు, వంశధార ప్రాజెక్టు ఎస్ఈ తిరుపతిరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మంత్రులు రామానాయుడు, అచ్చెన్నాయుడుకు మ్యాప్ ద్వారా వివరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

నీటి నిల్వ సామర్థ్యం పెంచాలి

(ఐదో పేజీ తరువాయి)

రూపొందించాం. వంశధార సమస్యలు పరిష్కారం కావడం లేదు. 2400 క్యూసెక్కుల నీరు నిల్వ ఉంచడంతోపాటు షట్టర్లు కుంభికోణం, ఒడిశాలో నేరడి సమస్యలు పరిష్కరిస్తే వంశధార నీరు ఇచ్ఛాపురం వరకు సులువు గా వెళ్తుందని మంత్రి అచ్చెన్న, అధికారులు వెల్లడించారు. దీనిపై మంత్రి రామానాయుడు స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఆఫ్‌షోర్‌ను వదిలేశారు..

పలాస మండలం రేగులపాడు వద్ద మహేంద్రతనయ నదిపై నిర్మించ తలపెట్టిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వది లేసిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేయగా, కాంట్రాక్టర్‌కు రూ.16కోట్ల మేర బకాయిలు చెల్లించామన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.90 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రాధాన్యత ప్రాజెక్టు కాకపోయినా, రైతులకు సాగు నీరు అందివ్వాలనే ఉద్దేశంతో పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించామని తెలిపారు. ఈ ఏడాది 7 లక్షల క్యూబిక్‌మీటర్లు మట్టి పనులు జరిగితే 1 టీఎంసీ నీరు నిల్వ చేసి సాగు నీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు బగాది శేషగిరి, పినకాన అజయకుమార్, చంద్రశేఖర్, పి.షణ్ముఖరావు ఉన్నారు.



రహదారి మధ్యలో ఉన్న బోరు

బోరు ఇలా... వాహనాలు వెళ్లేదెలా?

కొత్తూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బోరు తొలగిస్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనుకున్నారో... లేకపోతే మా పని రోడ్డు నిర్మించడం మాత్రమే... మిగిలిన విషయాలతో సంబంధం లేదనుకున్నారో గానీ రహదారి మధ్యలో మంచినీటి బోరును వదిలేసి అధికారులు ఎంచక్కా మిగిలిన పని పూర్తి చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 కృష్ణాపురం) వంశధార నిర్వాసిత కాలనీలో ఈ దృశ్యం మనకు కనిపిస్తుంది. కాలనీలో రహదారులు వేయకముందు మంచినీటి బోరు వేశారు. ఆ తరువాత రహదారిని నిర్మించారు. దీని వల్ల కాలనీ వాసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇతర కాలనీలకు వెళ్లడానికి ఇదే ముఖ్యమైన రహదారి. కాలనీవాసులు అనారోగ్యం పాలైతే... అంబులెన్స్‌లు ఈవైపు నుంచే రావలసి ఉంటుంది. బోరు అడ్డుగా ఉండడం వల్ల వాహనం ముందుకు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. కాలనీ వాసులు రోగిని చేతులపై మోసుకుంటూ ప్రధాన కూడలి వరకు తీసుకువెళ్లవలసి వస్తోందని స్థానికులు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బోరును అక్కడి నుంచి తొలగించి..మరోచోట వేయాలని, లేదా ప్రత్యామ్నాయ రహదారిని నిర్మించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం

కంచిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మైసూర్‌లోని దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో కంచిలి మండలంలోని గొల్లపుట్టుగ గ్రామానికి చెందిన మురపాల జగన్నాథరావు బంగారు పతకం సాధించాడు. భగవద్గీతలోని 700 శ్లోకాలను కంఠస్థం చేయడంతో ఈ బహుమతికి ఎంపిక య్యారు. మే 17న మైసూర్ దత్త పీఠంలో జరగబోయే వేడుకల్లో ఆయనకు బంగారు పతకాన్ని బహూకరించనున్నారు. ప్రస్తుతం కవిటి మండలం కొత్తకొజ్జిరియా ప్రభుత్వ పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయునిగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తండ్రి వల్లయ్య హిందూ ధర్మ పరిరక్షణ కోసం గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేసేవారు. జగన్నాథరావు మాష్టారు బంగారు పతకం సాధించడం పట్ల తోటి ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.



జగన్నాథరావు

గోతులు పూడ్చక.. జంగిల్స్ తొలగించక

●తరచూ ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్రవాహనచోదకులు ● ఇదీ కర్లపూడి-రాంపురం బీటీరోడ్డు దుస్థితి



కర్లపూడి-రాంపురం వయా బైరిబొడ్డపాడు రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన జంగిల్స్

నందిగాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లపూడి నుంచి రాంపురం వెళ్లే బీటీ రహదారి నిర్వహణ గాడితప్పింది. ప్రధానంగా అడుగడుగునా ఏర్పడిన గోతులు పూడ్చడానికి చర్యలు తీసుకోవడం లేదు. దీనికితోడు ఈ మార్గంలో జంగిల్‌ను ఏళ్ల తరబడి క్లియరెన్స్ చేయడం లేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా బాగా పెరగడంతో వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించడం లేదు. రోడ్డు గోతులమయమైనా, జంగిల్ వల్ల అగచాట్లకు గురవుతున్నా కనీస చర్యలు తీసుకోవడంలేదని పలువురు వాపోతున్నారు.దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు.ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టతరంగా ఉందని చెబుతున్నారు.2015లో కర్లపూడి నుంచి పద్మాపురం, బైరిబొడ్డపాడు, బెల్లుకోల, చిన్నలక్ష్మీపురం, జయపురం, రాంపురం వరకు బీటీ రహదారి నిర్మించారు. తర్వాత కనీస నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో రహదారి పొడవునా గోతులు ఏర్పడ్డాయి. దీనికితోడు జంగిల్స్ కూడా ఏపుగా పెరిగాయి. రాకపోకలు సమయంలో వాహనాలు తప్పించుకోవడానికి కూడా అవకాశం లేని విధంగా రహదారి మారడంతో నాలుగుచక్రాల వాహనదారులు భయం భయంతో ప్రయాణం సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఈ రహదారికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించడంతో పాటు జంగిల్స్‌ను తొలగించాలని కోరుతున్నారు.

సాంఘిక సంక్షేమశాఖ డీడీపై విచారణ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డిని ఉప కలెక్టర్ పద్మావతి మంగళవారం విచారణ నిర్వహించారు. తన కార్యాలయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వ్యక్తితోపాటు డీడీని విచారించారు. విశ్వమోహన్‌రెడ్డి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలిస్తానని చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు, వార్డెన్ల ప్రమోషన్లలో అవకతవకలకు పాల్పడినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో విచారణకు ఆదేశించిన విషయం విదితమే. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి తవిటయ్య, ప్రసాద్‌లు ఏడాదిన్నర కిందటే డీడీకి రూ.2.30 లక్షల రూపాయలు ఇచ్చామని చెప్పారు. మళ్లీ మరో రూ.20 వేలు డిమాండ్ చేయగా, ఇవ్వలేకపోవడంతో ప్రసాద్ పేరును జాబితా నుంచి తొలగించడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని డీడీని ఆయన కార్యాలయంలో కలవగా వెనక్కు పంపించినట్లు ప్రసాద్ తెలిపాడు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖలో సీనియారిటీని విస్మరించి జరిగిన పదోన్నతుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై వార్డెన్ తారకేశ్వరరావు పద్మావతికి ఆధారాలతో సహా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నేడు డైట్‌లో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

గుజరాతీపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వమరవల్లిలోని డైట్‌లో ఎస్ఎస్‌టీసీ ప్రాతిపదికన డిప్యూటేషన్ ద్వారా పోస్టులు భర్తీ చేసేందుకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. డైట్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఐదు సీనియర్ లెక్చరర్లు, 17 లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులను స్వీకరించామన్నారు.ఆయాఅభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా వ్యక్తిగత ఎస్ఆర్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని స్పష్టం చేశారు.

27న జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోగల స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ స్టేడియం వద్ద నాగావళి రివర్ బీచ్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పురుషులు, మహిళల కబడ్డీ జట్ల ఎంపికలను ఈనెల 27న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు నక్కరామకృష్ణారావు, కార్యదర్శి సాధు ముసలనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు ఒకప్రకటనలో తెలిపారు. పురుషులు 85కేజీల్లోపు,మహిళలు 75కేజీల్లోపు ఉండాలని, పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే రెండు నుంచి నాలుగో తేదీ వరకు కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

28లోగా పీఎం ఉషాపై నివేదిక ఇవ్వండి: వీసీ

ఎచ్చెర్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):ప్రధాన మంత్రి ఉచ్ఛాతర్ శిక్షా అభియాన్(పీఎంఉషా)నిధుల వినియోగానికి సంబంధించి ఈనెల 28లోగా నివేదికలు అందజేయాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని సూచించారు. మంగళవారం పీఎం ఉషాకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో మంజూరైన నిధుల వినియోగంపై సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పథకం కింద వర్సిటీకి రూ.20 కోట్లు వచ్చే అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత,ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.సంతోషపావని పాల్గొన్నారు.

విమానాశ్రయ సలహా కమిటీ సభ్యుడిగా శివప్రసాద్

పొందూరు,ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కింతలికి చెందిన దుంపల శివప్రసాద్‌ను విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సలహా కమిటీ సభ్యుడిగా కేంద్రప్రభుత్వం నియమించింది.విశాఖ ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన పనిచేస్తే సలహాకమిటీలో శివప్రసాద్‌తో కలిసి ఏడుగురు సభ్యులు ఉంటారు. టీడీపీ సీనియర్ నాయకుడు దుంపల సన్యాసిరావు కుమారుడు శివప్రసాద్ ప్రస్తుతం సీబ్రీజ్ రిసార్ట్స్ ఎపెక్స్ ఇన్‌ఫ్రా ఎండీగా ఉన్నారు. ఎమ్మెల్యే రవికుమార్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు శివప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. శివప్రసాద్ నియామకంపై సర్పంచ్‌లు తమ్మినేని మనెమ్మ, పైడి రామప్రసాద్, ఎంపీటీసీ హనుమంతురావు, కింతలి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

అరసవల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):పుడమితల్లి ఆయుష్షును పెంచేందుకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ కోరాడత్రినాథస్వామి కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గేదెల ఇందిరాప్రసాద్, పీజీగుప్తా, బీవీ రవిశంకర్, జీఎస్ రావు, జి.వాసుదేవరావు, ఎస్.సంజీవరావు, కామేశ్వరరావు, గీత, శాంతి, జ్యోతి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ తెలిపారు. కొళిగాం పాఠశాలలో ధరిత్ర దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులతో సేవ్ ఎర్త్‌లోగో ప్రాజెక్ట్ తయారు చేయించి పర్యావరణ పరిరక్షణపై అవగాహనకల్పించారు. విద్యార్థులతో ప్రాజెక్ట్ తయారు చేయించిన ఉపాధ్యాయులు పద్మావతి, పీడీ శ్రీనివాస్‌ను హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, చంద్రవదన, రేణుక, అమిత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

కంచిలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని చొౌత్రాయిపురం పాఠశాల హెచ్‌ఎం మడ్డు తిరుపతిరావు తెలిపారు.మంగళవారం గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి సౌకర్యాలను వివరించి తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చల్లా లింగమూర్తి, కర్రి సుందరరావు, నవీన్ పాల్గొన్నారు.

పాతపాడులో అడ్మిషన్ల డ్రైవ్

సరుబుజ్జిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):పాతపాడులో హెచ్‌ఎం బెండి మన్మథరావు ఆధ్వర్యంలో అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బగ్గు అప్పలరాజు, కూరంగి మంజుభారతి పాల్గొన్నారు.

గ్రామస్థుల సహకారంతోనే విద్యాభివృద్ధి

కవిటి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):గ్రామస్థుల సహకారంతోనే విద్యాభివృద్ధి సాధ్యమని మండల ఉపాధ్యక్షుడు పి.నేతాజీ తెలిపారు. మంగళవారం జగతి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం రమణమూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ డి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో రైతుకు మేలు

కంచిలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో రైతుకు మేలు జరుగుతుందని ఏవో కె.ధనుంజయ తెలిపారు. గోకర్ణపురంలో నవధాన్యాల సాగుపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దుర్గాప్రసాద్, కుమారి, కామరాజు పాల్గొన్నారు.

రెడ్డి యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం, గంజాం జిల్లాల రెడ్డి యువజన సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.మంగళవారం ఇచ్ఛాపురంలో 12గ్రామాల పంచాయతీదారుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది.ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడిగా రెడ్డి హరిబంధ్ రెడ్డి, కార్యదర్శిగా పిల్ల హరిబాబు, ట్రెజరర్‌గా గిన్ని బాలరాజు, సలహాదారులుగా సోమశేఖర్, లంక దుర్గారావు, గిన్ని సోమేష్ ఎన్నికయ్యారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 12వఆల్ ఇండియా బాలల చిత్రలేఖనం పోటీలు, ప్రదర్శనల్లో ప్రతిభచూపారు.విజయవాడలో ఇటీవలజరిగిన ఈ పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించారు. కందుల తరుణ్, నూలు చైతన్య తామాడ నవీన్, అంబటి సాయి తేజస్వి, వడగ పునీత్, గొర్లె పవన్‌కు ఈ పతకాలు లభించాయి. 30 మంది విద్యార్థులు ధ్రువపత్రాలు అందుకున్నారు. ఈమేరకు విద్యార్థులను మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దున్న రామ్మోహనరావు, హెచ్‌ఎం మణిపాత్రుని నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, పద్మజ, అమరావతి, గణపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి: ప్రభుత్వ విప్



కొండపోలేరులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రభుత్వవిప్ అశోక్

కంచిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల పరిస్థితుల్లో సైతం లక్ష్యాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని ప్రభుత్వవిప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. మంగళవారం మండలంలోని కొండపోలేరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామపెద్దలు కప్ప హరికృష్ణ, రాములమ్మ దంపతులు నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూరాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందనితెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శివరాంప్రసాద్, నాయకులు బంగారు కురయ్య, మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, ఎం.పూర్ణ, హెచ్‌ఎం జగదీశ్వరరావు, మద్దిల కేశవరావు, టీవీ రమణ పాల్గొన్నారు.

కష్టపడేతత్వాన్ని అలవరచుకోవాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడేతత్వాన్ని అలవరచుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో ఏబీవీపీ కన్వీనర్ బోరగోపీ ఆధ్వర్యంలో యువతా మేలుకో-జగతిని ఏలుకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఏడాది ఇంటర్‌లోప్రతిభకనబరచిన విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సూర.శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రమౌళి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి జి.లలిత, కీర్తి భార్గవ నాయుడు, మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండుశంకర్ కోరారు. మంగళవారం రూరల్ మండలంలోని కిష్టప్పపేట ఉన్నత పాఠశాలలో తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యవతి పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి: జడ్పీ చైర్‌పర్సన్

అరసవల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ నిధులను ఎక్కువగా రోడ్ల నిర్మాణంపై కాకుండా గ్రామాల్లో పారిశుధ్య సమస్య నివారణ, తాగునీరు వంటి అంశాలపై వెచ్చించాలన్నారు. శ్మశానవాటిక నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీల్లో నిర్వహించే పనుల్లో పర్యవేక్షణలోపమే ప్రధాన కారణమని, సరిదిద్దుకోవాలన్నారు. ఇంజినీరింగ్‌అసిస్టెంట్ల శిక్షణకు చర్యలుతీసుకోవాలని సూచించారు.విద్యుత్ సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ పంచాయతీలు బాగా పనిచేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు సమర్పించిన నివేదికలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జడ్పీటీసీలు పొగిరిబుచ్చిబాబు, మీసాల సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనంపై తల్లిదండ్రుల నిరసన

పొందూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని భగవాన్‌దాస్‌పేట ప్రభుత్వ పాఠశాలను నరసాపురం ఆదర్శప్రాథమిక పాఠశాలలో విలీనంచేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పొందూరు ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భగవాన్‌దాస్ పేట ఎంపీపీ పాఠశాలను నరసాపురం ఆదర్శప్రాథమిక పాఠశాలలో విలీనం చేసేందుకు అధికారులు పంపించిన ప్రతిపాదనలపై పునరాలోచించాలని కోరారు. పిల్లలు నరసాపురం పాఠశాలకు భారీ వాహనాలతో రద్దీగా ఉండే రాష్ట్ర రహదారి దాటాల్సిఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. లైదాం ఎంపీయూపీ పాఠశాల స్థాయిని తగ్గించి మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పుచేయడంపైనా లైదాం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కూడా నిరసన తెలిపారు. అనంతరం ఎంఈవోకు భగవాన్‌దాస్‌పేట, లైదాం పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు.

నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి: డీఐజీ

గుజరాతీపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశించారు.విశాఖ రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలతో మంగళవారం క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం నియంత్రణ, నిందితుల అరెస్టు, వారి ఆస్తుల జప్తు, డిఅడిక్షన్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా కార్య క్రమాలపై సమీక్షించారు. గంజాయి అక్రమరవాణాలో పాల్గొంటున్న వ్యక్తుల ఆస్తులను గుర్తించి వెంటనే జప్తు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీలు మహేశ్వరరెడ్డి, తుహిన్ సిన్హా, అమిత్ బర్దర్, వకుల్ జిందాల్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

సరుబుజ్జిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ప్రింటర్ వితరణ

ఇచ్ఛాపురం,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ఇన్నేసుపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు రూ.25 వేలు విలువ చేసే కలర్ ప్రింటర్‌ను హెచ్‌ఎం ఆర్.సూర్యనారాయణకు అందజేశారు.కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ లత, ఉపాధ్యాయులు శంకరం, తారకేశ్వరావు, యువత పాల్గొన్నారు.

నూర్పిడి యంత్రాల పరిశీలన

బూర్జ,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అల్లెన, చినలంకాం, నీలాపురం, పాలవలస గ్రామాల్లో ఆహారం, పోషణభద్రతా పథకంలో భాగంగా రైతులకు రాయితీపై ఇచ్చిన నూర్పుడి యంత్రాలను వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ సహాయ వ్యవసాయసంచాలకుడు ఎ.మధులేటి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా యంత్రాల పనితీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారులు సురేష్,ఎన్.శ్రీనివాసరావు, వీఏఏలు సాయితేజ, కృష్ణ, జగదీష్, వసంత, హేమ ఉన్నారు.

గంజాయి కేసులో ఒకరికి నాలుగేళ్ల జైలుశిక్ష

అరసవల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో ఓ నిందితునికి నాలుగేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఎస్పీ కథనం మేరకు.. 2023 ఏప్రిల్ 25న మెళియాపుట్టిలో ఎస్ఐ రాజేష్ సిబ్బందితో కలిసి పోలీసు స్టేషన్ ఎదురుగా వాహనాలు తనిఖీచేస్తున్నారు. ఓ వ్యక్తి తన చేతిలో ఉన్న బ్యాగును భుజానికి వేసుకుని అనుమానాస్పదస్థితిలో టెక్కలి వైపు వేగంగా నడుచుకుని వెళ్లడం గమనించి, పోలీసులువెంబడించి పట్టుకున్నారు. ఒడిశాలోని చడియాకు చెందిన బులుమాలి వద్ద 7.5 కిలోల గంజాయిని గుర్తించారు. ఈ గంజాయిని పలాస రైల్వేస్టేషన్‌లో ఉన్న ఏలియా రైకాకు ఇస్తే తనకు కేజీకి రూ.500లు ఇస్తారని ఒప్పుకున్నాడు. ఎస్ఐ రాజేష్ మధ్యవర్తుల సమక్షంలో రిపోర్టును తీసుకుని కేసు నమోదుచేశారు. అనంతరం పాతపట్నం సీఐ వినోద్‌బాబు దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ముద్దాయిపై నేరం రుజువుకావడంతో నాలుగేళ్ల కారాగారశిక్ష, రూ.1000ల జరిమానా, చెల్లించని ఎడల నెలరోజుల సాధారణ జైలుశిక్ష విధిస్తూ మంగళవారం ఫస్ట్ ఏడీజే శ్రీకాకుళం న్యాయ్యాధికారి తీర్పు ఇచ్చారు. మిగిలిన ముద్దాయిలపై నేరం నిరూపణ కానందున వారిపై కేసును కొట్టివేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అరసవల్లి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఎం కింద కమ్యూనిటీ హెల్త్ అధికారులుగా పనిచేస్తున్న తమకు రెండేళ్లుగా జీతాలు సరిగ్గా రావడం లేదని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఉషారాణి ఆందోళన వ్యక్తంచేశారు. సకాలంలో జీతాలు చెల్లించి, ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని కలెక్టరేట్ వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే పార్కు ఆవరణలో సీహెచ్‌వోలు ధర్నా నిర్వ హించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యనిర్వాహణ అధ్యక్షుడు సీహెచ్ రాజీవ్, జి.రాఘవ, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు నిర్వహించాలి

రణస్థలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతూ భూసార పరీక్షలు నిర్వహించాలని ఏవో విజయ్‌భాస్కర్ తెలిపారు. మంగళవారం సంచాం రైతు సేవా కేంద్రంలో మట్టి నమూనాల సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బెల్లుపడలో చిన్నజీయర్ స్వామి



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న త్రిదండి చిన్న జీయర్‌స్వామి

ఇచ్ఛాపురం, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోగల బెల్లుపడలో జరుగుతున్న శ్రీరామతారక మహామంత్ర సహిత పంచ కుండాత్మక యజ్ఞానికి శ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి హాజరయ్యారు. మంగళవారం రాత్రి గ్రామానికి వచ్చిన ఆయనకు పెద్దలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ధర్మం, భక్తి, సేవా భావం కోసం వివరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చింతామణి అమ్మవారి సంబరం

కవిటి, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): కవిటిలోని చింతామణి అమ్మవారి మంగళవారం భక్తిశ్రద్ధలతో జగతికి చెందిన పి.వెంకటరావు,ఉషారాణి దంపతులు నిర్వహించారు.అమ్మవారి గజముద్దలనుకాళికావేషధారణలతో ఊరేగించారు. అనంతరం ఆలయంలో మొక్కులు చెల్లించారు.

చెట్టుపొదిలాంలో బాబా తిరు వీధి

జి.సిగడాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):చెట్టుపొదిలాంలో షిర్డీసాయి అలయ వార్షికోత్సవం పురష్కరించుకొని ధర్మకర్త అర్జున్ కుమార్ భూపతి ఆధ్వర్యంలో మంగళవారం బాబా తిరువీధి నిర్వహించారు.

రొట్టవలసలో తారకరామ మహాయజ్ఞం

సరుబుజ్జిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రొట్టవలస శ్రీరామానందాశ్రమంలో తారకరామ మహాయజ్ఞం మంగళవారం నిర్వహించారు. హోమాలు, రామకోటి స్థూప ప్రతిష్ఠ చేపట్టారు. కార్య క్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు వెంకటరమణస్వామి, వైకుంఠరావు పాల్గొన్నారు.

జమ్ము-కశ్మీర్ ఘటనలో మృతుల కుటుంబాలకు సంతాపం

శ్రీకాకుళం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి జరిగిన ఘటనపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఖండించారు. మృతుల కుటుంబాలకు ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. ఈ ఘటన తనకు మానసికంగా కలచివేసిందని, దిగ్ర్భాంతికి గురిచేసిందని తెలిపారు. క్షతగాత్రుల త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

తాబేళ్ల మృత్యువాతపై వివరాల సేకరణ

గార, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) శ్రీకూర్మక్షేత్రంలో తాబేళ్ళు మృత్యువాత పడిన సంఘటన నేపథ్యంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత మంగళవారం సంఘటన స్థలాన్ని, తాబేళ్ళ పార్కును పరిశీలించారు. పార్కు నిర్వాహకుడు రమణమూర్తి, అక్కడ పనిచేస్తున్న మహిళను, ఆలయ సిబ్బందిని వివరాలు సేకరించారు.ఇక్కడ తాబేళ్ళు మృత్యువాత పడిన సంఘటన నేపథ్యంలో పూర్తి వివరాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆమె వచ్చారు. అనంతరం శ్రీకాకుళంలో జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయానికి కూడా వివరాలు తెలుసుకోవడం కోసం వెళ్లారు.

తాబేళ్ల మృతిపై దర్యాప్తు చేయాలి

శ్రీకూర్మనాథుని ఆలయంలో తాబేళ్ల మృతిపై దర్యాప్తు చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, వైసీపీ నాయకులు కోరారు.ఈ మేరకు మంగళవారం వారు శ్రీకూర్మక్షేత్రంలో తాబేళ్ల మృత్యువాతపడిన స్థలాన్ని, తాబేళ్ల పార్కును పరిశీలించారు. అనంతరం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు.

శతక పద్య గ్రంథం బహూకరణ

గార, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):అంపోలు జడ్పీపాఠశాల విద్యార్థులకు శతక పద్య రచన గ్రంథాన్ని ఆ గ్రామానికి చెందిన సంస్కృత ఆగమ పండితులు ఆరవెల్లి వెంకటరమణమూర్తి బహూకరించారు. పాఠశాల వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ

జి.సిగడాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శీర రాము, సహిత ఉపాధ్యాయులు టి.కృష్ణ, సీహెచ్ మాధురి, కృష్ణవేణి పాల్గొన్నారు.

5 కేజీల గంజాయి పట్టివేత

● నిందితుడి అరెస్ట్ ● సెల్‌ఫోన్ స్వాధీనం


మాట్లాడుతున్న సీఐ వి.రామారావు

పాతపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకువస్తూ మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద దువ్వు సాయిరెడ్డి అలియాస్ సాయి పట్టుబడినట్లు సీఐ వి.రామారావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం ఉదయగిరి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నుంచి పర్లాకిమిడిలో రూ.12 వేలకు 5.662 కేజీల గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరు జిల్లా సూళ్లూరు పేటకు చెందిన ఒక వ్యక్తికి విక్రయిం చేందుకు గాను తీసుకువస్తూ మధ్యాహ్నం 1.30 గంటలకు పట్టుబడ్డాడన్నారు. అరసవల్లి మిల్లుకూడలి రెడ్డిక వీధికి చెందిన దువ్వు సాయిసురేష్ రెడ్డి ఐటీఐ చదువుకొని కుటుంబ పోషణ నిమిత్తం చదువు మానేసి గార మండలం పొగాకువానిపేట గ్రామంలో వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకి చెందిన ఒక వ్యక్తితో పరిచయం ఏర్ప డింది. అప్పటికే గంజాయి వ్యాపారంలో ఉన్న సదరు వ్యక్తి కమీషన్ ఆశ చూపి గంజాయి తరలింపులో సహకరించాలని కోరగా సాయి అంగీకరించాడు. గతంలోనూ రెండు పర్యాయాలు గంజాయి నెల్లూరుకు తరలించగా రూ.3 వేలు చొప్పున కమీషన్ కూడా ఇచ్చాడు. అయితే ఈ సారి ఎక్కువ మొత్తంలో తీసుకురావాలని కోరగా సాయి ఉదయగిరి ఏరియాకు చెందిన వ్యక్తిని సంప్రదించి మంగళవారం మధ్యాహ్నం పర్లాకిమిడి బస్టాండ్ వద్ద సదరు వ్యక్తికి రూ.12 వేలు చెల్లించి మూడు మూటలుగా ఉన్న గంజాయి ప్యాకెట్లను తీసుకుని పాతపట్నంలో బస్సు ఎక్కేందుకు నడుచు కుంటూ వస్తుండగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 5.662 కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత నిర్వీర్యమవు తున్నా రన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచి ంచారు. నిందితుడిని పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఎస్ఐ బి.లావణ్య, ఏఎస్ఐ ఎల్.అప్పారావు, కానిస్టేబుళ్లను ఎస్పీ మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని వైఎస్ విగ్రహం ధ్వంసం

● శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద


మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద

అరసవల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం బైరి జంక్షన్ వద్ద దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఈనెల 20న లారీ ఢీకొని ధ్వంసమైనట్లు శ్రీకా కుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ పైడపు నాయుడు, రూరల్ ఎస్ఐ రాము కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నరసన్నపేట నుంచి లారీ గంగమ్మ రైసు మిల్లుకు 20వ తేదీ సాయంత్రం బయలుదేరింది. బైరి జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా లారీ వెనుక భాగం తగిలి జంక్షన్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహం ధ్వంసమైంది. ఈ విష యాన్ని గుర్తించిన లారీ డ్రైవర్ మిల్లు యజమానికి తెలిపాడు. వెంటనే లారీ ఓనర్‌కు కూడా మిల్లు యజమాని విషమయై సమాచారం ఇచ్చాడు. ధ్వంసమైన విగ్రహాన్ని అదే చోట ఏర్పాటుకు ఆ ఇద్దరు నిర్ణయించారు. అయితే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అసిరినాయుడు ఎవరో విగ్రహం పడగొట్టారని ఫిర్యాదు చేశారన్నారు. పూర్తి వివరాలు తెలుసు కోకుండా ఫిర్యాదులు చేస్తే వర్గాల మధ్య విభేదాలు తలెత్తే అవకాశముందని, ఎవరూ అలా తప్పుగా ఫిర్యాదు చేయవద్దని కోరారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని, ఎవరైనా తప్పుడు సమాచారం పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో ఎటువంటి రాజకీయ కోణం, దురుద్దేశాలు లేవన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత


పట్టుకున్న పశువులు

కొత్తూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసి ఒకరి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీర్ ఆలీ తెలిపారు. కుంచాలపేట వద్ద మంగళవారం వాహ నాలు తనిఖీ చేస్తుండగా లగేజీ వ్యాన్‌లో ఎనిమిది పశువులను తరలిస్తున్నట్లు గుర్తించి బలద గ్రామా నికి చెందిన బోరెవెల్ల షన్ముఖరావును అదుపులోకి తీసుకున్నామన్నారు. స్వాధీనం చేసు కున్న పశువులను గోశాలకు తరలించినట్లు తెలిపారు.

రైలు కింద పడి విద్యార్థి మృతి


గోపాల్(ఫైల్)

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దపుట్టి ఆర్‌హెచ్ కాలనీకి చెందిన నెయ్యిల గోపాల్ విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. లొద్దపుట్టికి చెందిన గోపాల్ విశాఖ జిల్లా తగరపు వలస వద్ద ఓ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లమో రెండో సంవ త్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం తల్లి డిల్లీశ్వరికి ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు. రాత్రి అయినా రాకపోవడంతో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్‌కు కుటుంబసభ్యులు ఫోన్‌లో సంప్రదించారు. రైలు కిందపడి గోపాల్ మృతి చెందాడని యాజమాన్య వర్గాలు తెలియజేయడంతో ఘటనా స్థలానికి కుటుంబ సభ్యులు చేరుకున్నారు. ఇంటికి వస్తానని చెప్పిన కొడుకు ఎందుకు మృతి చెందాడో అర్థం కావడం లేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


రోడ్డు ప్రమాదం దృశ్యం

రణస్థలం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రణస్థలం జాతీయ రహదారిపై పాత పెట్రోల్ బంకు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం నుంచి ద్విచక్ర వాహనం పై లావేరు మండలం పైడి వలసకు చెందిన పి.శివాజీ, ఆర్.వెంకటేష్, బి.సీతయ్య వస్తున్నారు. పాత పెట్రోల్ బంకు వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో వ్యాన్‌ను ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు గాయ పడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి 108 సిబ్బంది తరలించారు. ఈ మేరకు జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ధరిత్రీ దినోత్సవం

ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని మంగళవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, భూమిని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థినీ విద్యార్థులు మానవహారాలు, ర్యాలీలు నిర్వహించారు. ధరిత్రిని పరిరక్షించుకోవాలని నినాదాలు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


పాతపట్నం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పలాస రూరల్: గ్లోబు ఆకారంలో బ్రాహ్మణతర్లా విద్యార్థినుల మానవహారం


హరిపురం: మందస కేజీబీవీలో మొక్క నాటుతున్న డీఈవో తిరుమల చైతన్య


ఎల్ఎన్‌పేట: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

వైసీపీ నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ ఔట్

● పార్టీ క్రమశిక్షణ దాటారని ఫిర్యాదులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నేనే వైసీపీకి రాజు.. నేనే మంత్రినంటూ ఇతర పార్టీల నాయకులతో పాటు సొంత పార్టీ నేతలపై నోరు పారేసుకునే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కొంత కాలంగా శ్రీను.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను అసభ్య పద జాలంతో మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. నోరెత్తితే బూతులు మాట్లాడి పార్టీకి చెడ్డపేరు తీసుకు వస్తున్నారని ఆ పార్టీ నేతలే ఫిర్యాదులు చేశారు. దీంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ సూచనలతో దువ్వాడను సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ అధినాయకత్వం ప్రకటించింది. దువ్వాడ వైసీపీలో చేరినప్పటి నుంచి వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి దృష్టిలో పడేందుకు ఇతర పార్టీల నేతలపై బూతులతో విమర్శలు చేశారు. అందుకు గాను నాడు శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చింది. దువ్వాడ 2019లో శ్రీకాకుళం నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. మళ్లీ 2024లో వివిధ కారణాల దృష్ట్యా టెక్కలి నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి కింజరాపు అచ్చెన్నాయుడు చేతిలో ఘోర పరాజయం పొందారు. మరో మహిళతో సహజీవనం చేస్తున్నారని పేర్కొంటూ దువ్వాడ భార్య, పిల్లలు రోడ్డెక్కడంతో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. వైసీపీకి చెడ్డ పేరు వస్తుండడంతో నష్ట నివారణకు ఈ చర్యలు చేపట్టారు.

అది నుంచీ వివాదాస్పదుడే..

ఎమ్మెల్సీ ఏ పార్టీలో ఉన్నా వివాదాస్పదుడిగానే ముద్ర పడింది. గతంలో టీడీపీ, ప్రజారాజ్యం, కాంగ్రెస్ పార్టీల్లో ఉన్నప్పుడు సొంత పార్టీ నేతలపై తిరుగుబాటు చేసిన సందర్భాలున్నాయి. అయితే వైసీపీలో చేరి మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి నమ్మిన బంటుగా పేరుతెచ్చుకున్నారు. పార్టీలో ఉన్న సీనియర్ నాయకులను కాదని దువ్వాడ మాటకే విలువ పెరిగేలా రాజకీయం చేశారు. అయితే వైసీపీ అధికారం కోల్పోవడం, ఆయన కుటుంబం రోడ్డెక్కడంతో టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి దువ్వాడను తప్పించి పేడాడ తిలక్‌కు ఇవ్వడం తెలిసిందే. అయితే ఇన్‌చార్జి బాధ్యతలను తప్పించినా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఆయన మానలేదు. దీంతో పాటు పార్టీ లైన్ దాటుతున్నారని కొంతకాలంగా పార్టీ నాయకులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో పాటు దువ్వాడ గత రెండు నెలలుగా టెక్కలిని విడిచి హైదరాబాద్‌కు మకాం మార్చారు. నాలుగు రోజుల కిందట నియోజకవర్గంలో అడుగుపెట్టి విలేకరుల సమా వేశం ఏర్పాటు చేశారు. అయితే ఏం జరిగిందో గాని ఎప్పుడో చేయాల్సిన పనిని ఇప్పుడు పార్టీ అధిష్ఠానం ఇప్పుడు చేసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దువ్వాడ సస్పెన్షన్‌తో టెక్కలి వైసీపీలో రాజకీయాలు హీట్‌ను పెంచాయి.

దువ్వాడ వర్గానికి షాక్

వైసీపీ నుంచి దువ్వాడ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయడంతో ఆయన వర్గానికి షాక్ తగిలింది. ఎప్పటికైనా దువ్వాడను మళ్లీ ఇన్‌చార్జిగా నియమిస్తారని ఎదురుచూస్తున్న ఆయన వర్గం పార్టీ నిర్ణయంతో ఆందోళన చెందుతోంది. వైసీపీ నాయకురాలు మాధురి సైతం పార్టీ ఇన్‌చార్జి మేము పెట్టిన భిక్ష అంటూ గతంలో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఏది ఏమైనా దువ్వాడ సస్పెన్షన్‌తో టెక్కలి వైసీపీలో ఆందోళన కనిపిస్తోంది.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

జి.సిగడాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతవురిటి గ్రామానికి చెందిన బాలబొమ్మ వెంకట దినేష్ కృష్ణను భార్య హత్య కేసులో మంగళవారం అరెస్టు చేసినట్లు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. జి.సిగడాం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వై.మధుసూదనరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పాలఖండ్యాం పంచాయతీ పరిధి జగన్నాథపురం గ్రామానికి చెందిన భవాని(21) సంతవురిటి గ్రామంలోని అత్తవారింటిలో ఈనెల 15న అనుమా నాస్పదంగా మృతి చెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాక్షులను విచారించి సేకరించిన సాక్ష్యాధారాలు, పోస్టుమార్టం ఆధారంగా భవానితో భర్త బాలబొమ్మ వెంకట దినేష్ కృష్ణ గొడవపడి ఈనెల 15 తెల్లవారుజామున గొంతు నొక్కి చంపినట్లు నిర్ధారణ కావడంతో అనుమానాస్పద కేసును హత్య కేసుగా నమోదు చేశారు. దినేష్ కృష్ణను పొందూరు కోర్టులో ప్రవేశ పెట్టి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

మెళియాపుట్టి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టెక్కలి-మెళియాపుట్టి రోడ్డులో కుడ్డబ జంక్షన్‌లో మంగళ వారం గ్రానైట్ లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు 2 గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు లారీకి మరమ్మతులు చేసి పక్కకు తీయడంతో వాహ నాలు తరలివెళ్లాయి.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు దివ్య ఎంపిక


దివ్య

నందిగాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు మదనాపురం కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థిని జి.దివ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.జ్యోతి, పీఈటీ పి.ప్రశాంతి తెలిపారు. అండర్-16 విభాగంలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలోని జయ పాల్‌సింగ్ స్టేడియంలో జరుగు పోటీల్లో దివ్య పాల్గొంటుందన్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని వారు ఆకాంక్షించి అభినందించారు. కేజీబీవీలో అకడమిక్, నైపుణ్య విద్య, ఫుడ్ ప్రోసె సింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థినులకు ధ్రువపత్రాలు అందజేశారు.

జనావాసంలోకి జింక


జింకను పరిశీలిస్తున్న గ్రామస్థులు

హిరమండలం, ఏప్రిల్ 22(ఆంధ్ర జ్యోతి): అటవీ ప్రాంతంలో దారి తప్పిన జింక అవలంగి గ్రామం లోకి వచ్చింది. ఎండ లు మండిపోతున్న తరుణంలో దాహార్తిని తీర్చుకునేందుకు జింక గ్రామంలోకి రావడాన్ని గమనించిన స్థానికులు దానికి సపర్య లు చేశారు. వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారం ఇవ్వగా సారవకోట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఈశ్వరరావు, ఎఫ్‌బీవో ఎం.అజయ్ అక్కడికి చేరుకుని జింకను స్వాధీనం చేసుకుని బొమ్మిక కొండపై విడిచిపెట్టారు. జింక సమీప మాలువ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి తాగు నీటి కోసం దారితప్పి వచ్చి ఉంటుందని వారు భావించారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో వేదశ్రీ ప్రతిభ


వేదశ్రీ

నందిగాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నందిగాం మండలం కాపు తెంబూరు గ్రామానికి చెందిన సింగుపురం వేదశ్రీ ప్రతిభ కనబరిచింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో వేదశ్రీ ఎంపీసీ విభాగంలో 995 మార్కులు సాధించింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కార్పొరేట్ కళా శాలలో చదువుతోంది. తండ్రి లక్ష్మీనారాయణ బిల్డర్. ఈ సందర్భంగా వేదశ్రీని టీడీపీ నాయకుడు కొల్లి హరిబాబుతో పాటు గ్రామస్థులు అభినందించారు.

వేతన ఒప్పందం చర్చలు వాయిదా

పలాస, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జీడి కార్మికులు, వ్యాపారుల మధ్య మంగళవారం జరిగిన వేతన ఒప్పంద చర్చలు వాయిదా పడ్డాయి. స్థానిక క్యాజు అసోసియేషన్ సమావేశ మందిరంలో జీడి కార్మికులు, వ్యాపారుల సమన్వయ కమిటీ సమావేశం వ్యాపార సంఘ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వ్యాపారులు, కార్మికులు కలిసి పనిచేస్తే జీడి పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, రెండేళ్లకోసారి జరగాల్సిన వేతన ఒప్పందం మే 15వ తేదీతో పూర్తవుతుందన్నారు. వ్యాపారసంఘ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్‌గుప్తా మాట్లాడుతూ.. వ్యాపారులు, కార్మికుల మధ్య అభిప్రాయభేదాలు ఉండకూడదని, సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో ఇరు సంఘాల నేతలు ఎస్.ఈశ్వరరావు, కె.రాము, మల్లా సంతోష్, పలువురు జీడి వ్యాపారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి

చిత్రలేఖనం పోటీలో చాపర విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

మెళియాపుట్టి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో నిర్వహించిన 12వ ఆల్ ఇండియా చిల్డ్రన్స్ చిత్రలేఖనం పోటీల్లో చాపర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించినట్లు హెచ్ఎం చిట్టిబాబు తెలిపారు. 63 మంది విద్యార్థులు పాల్గొనగా ఆర్.తునుజ ఆల్‌ఇండియా బాల చిత్ర కళా అవార్డు సాధించిందన్నారు. మరో ఐదుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడు మాధవరావు పాల్గొన్నారు.

తరగతుల విలీనం వద్దు


ఎంఈవో రాంబాబుకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హిరమండలం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): చొర్లంగి ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో విలీనం వద్దని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ఎంఈవో కె.రాంబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. తుంగతంప కాలనీలో విలీనం చేస్తారని తెలుస్తోందని, ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. చొర్లంగిలోనే ఐదు తరగతులను నిర్వహించేలా చర్యలు తీసుకోవాని కోరారు. అంతకు ముందు ఉదయం పాఠశాలలో ఎస్ఎంసీ సమావేశం నిర్వహించి విద్యార్థులను వేరే పాఠశాలకు పంపించకూడదని తీర్మానించారు.

క్లోరినేషన్ చేయించాలి

జలుమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రక్షిత నీటి పథకాల ట్యాంకుల్లో నెలకోసారి తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని పాతపట్నం యూనిట్ మలేరియా అధికారి వై.కె.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో బావులు, బోర్లు అడుగంటడం వల్ల బురదనీరు వచ్చి రోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వాటి నివారణకు సచివాలయం సిబ్బంది, గ్రామ పంచాయతీ అధికారులు ప్రతి నెలా క్లోరినేషన్ చేయించాలన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణపై అవగాహన కలిగించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఆరోగ్యవిస్తరణాధికారి చిన్నరాజులు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించండి

హరిపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, గిరిజన తండాల్లో నేరాల నియంత్రణకు సహకరించాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. మందస పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. దొంగతనాలు, దోపిడీలు, గంజాయి, సారాను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై పూర్తి స్థాయి లో సమాచారాన్ని స్టేషన్ కు అందించాలన్నారు. కుటుంబ తగాదాలపై దృష్టి సారించి మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరంపల్లి హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి, పూండిగల్లికి చెందిన ఉపాధ్యాయుడు మూల ఉపేంద్ర మంగళవారం మైక్‌సెట్‌ను అందించారు. తాను చదువుకున్న పాఠశాలకు తనవంతు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఉపేంద్రను హెచ్ఎం ఎం.కేశవరావు, విద్యా కమిటీ చైర్మన్ బి.లక్ష్మీపతి, టి.కూర్మయ్య, కృష్ణారావు అభినందించారు.

ప్రైవేటు పాఠశాలలు 25 శాతం సీట్లు కేటాయించాలి

పాతపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సిందేనని ఎంఈవోలు ఎ.గోవిందరావు, సీహెచ్ తిరుమలరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో వారు మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం ప్రకారం పేద బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ఈ సీట్లు కేటాయించాల్సి ఉందన్నారు. ఈనెల 26వ తేదీలోగా ప్రైవేటు పాఠశాలల సీఎస్ ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 28 నుంచి మే 15వ తేదీలోగా పేద, బడుగు బల హీనవర్గాల నుంచి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించవచ్చన్నారు.

ఆదర్శనీయురాలు సావిత్రీబాయి పూలే

హరిపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే సమాజానికి చేసిన సేవలు ఆదర్శనీయమని డీఈవో తిరుమల చైతన్య అన్నారు. మందస ఎమ్మార్సీ ఆవరణలో మంగళవారం సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో సమాజ సేవ దృక్పథంతో ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. విగ్రహదాత గున్న గంగాధర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడ్డమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మెళియాపుట్టి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొసమాళ గ్రామంలో జడ్డిమ్మతల్లి గ్రామ దేవత ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరువీధి చేపట్టారు. అమ్మవారికి ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

25 లీటర్ల సారా స్వాధీనం

కంచిలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లుండ జంక్షన్ వద్ద మంగళ వారం నిర్వహించిన దాడుల్లో ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలిపారు.ఈ మేరకు సారా తరలిస్తున్న రత్నాల ఢిల్లేశ్వరరావు, నర్తు హేమరాజులను అదుపులోకి తీసుకుని, ద్విచక్రవాహనం సీజ్ చేసినట్లు చెప్పారు.

250 సారా ప్యాకెట్లతో..

సోంపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలంలోని ఎంఎస్‌పల్లికి చెందిన డిల్లేశ్వరరావు 250 సారా ప్యాకెట్లు తరలిస్తుండగా అరెస్టుచేసినట్లు ఎక్సైజ్ మొబైల్ పార్టీ సీఐ జీవీ రమణ తెలిపారు. ఆయనకు సరఫరా చేసిన నర్తు హేమరాజుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

22 ఏళ్లుగా లో వోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నాం

టెక్కలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తేలినీలాపురం గ్రామంలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, తగు చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ పేడాడ రాజారావుతోపాటు గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 22 ఏళ్ల నుంచి ఓ వోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని, ఫ్యాన్లు, మోటార్లు పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు. అనేక పర్యాయాలు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పక్షుల విహార కేంద్రమైన తేలినీలాపురానికి సింగిల్ ఫేజ్ కరెంట్ మాత్రమే ఇస్తున్నారన్నారు. గ్రామంలో 250 ఇళ్లు ఉన్నాయని, త్రీఫేజ్ కరెంట్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు.

తప్పుడు ర్యాంకుల ప్రకటనలతో మోసం

కాశీబుగ్గ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తప్పుడు ర్యాంకుల ప్రకటనలతో కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు మోసం చేస్తున్నాయని, వీటిపై విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రవి అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల జేఈఈ మెయిన్స్ ర్యాంకులు తమ విద్యా సంస్థలే సాధించినట్లు ప్రకటనలిస్తున్నా రన్నారు. ఒకే విద్యార్థి ఒకే సమయంలో రెండు కళాశాలల్లో ఎలా చదువుతారని ప్రశ్నించారు.

రెండోరోజూ ప్రతిష్ఠోత్సవాలు

పోలాకి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజపురంలో రామమందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠో త్సవాలు రెండోరోజు మంగళవారం కొనసా గాయి. ఈ సందర్భంగా పంచ శయ్యాధి వాసాలు, దిగ్బలి ప్రదానం, నవగ్రహ భద్రమండలం, యంత్రార్చనలను పురోహితుడు దార్లపూడి గణేష్ శర్మ ఆధ్వర్యం లో రుత్వి కులు నిర్వహించారు. సాయంత్రం వేంకటేశ్వర మహిళా మండలి సభ్యులు కోలాట ప్రదర్శన చేశారు.